కథ

# గాలినీడ

బి.పి.కరుణాకర్

"నమస్కారమండీ" అన్నాను.


సాయిలక్ష్మి సంతకం చేస్తున్న కాయితాల్లోంచి తల పయికెత్త లేదు. అద్దాల తలుపు తెరుచుకుని నేను ఆమె గదిలోకి ప్రవేశించేప్పుడు ఆమె నన్ను చూడడం గమనించాను. నేను రావడం ఆమెకు ఇష్టంలేదని నాకు తెలుసు. వాళ్ల బేంకుకు రావడం అది నాలుగోసారి. ఆమె మేనేజరుగా పనిచేస్తోంది. ముప్పయి అయిదు సంవత్సరాలుంటాయి. ఆమె నాకు ప్రతి నమస్కారం చేస్తుందని ఎదురు చూడలేదు. మర్యాద కోసమయినా కూర్చోమంటుంది అనుకున్నాను. కూర్చోమనలేదు. రెండు నిమిషాలపాటు ఆమె ఎదురుగా నిలబడ్డాను. బల్లకు దగ్గరగా జరిగి కారు తాళాలు, సెల్ ఆమె బల్ల మీద పెట్టి కుర్చీ బల్ల దగ్గరకు లాక్కుని కూర్చున్నాను. ఆవేళ నా సంగతి అటో ఇటో తేల్చుకుందామనే వచ్చాను.

బల్ల మీద నా మోచేతులు పెడుతోంటే తలెత్తి నా ముఖంలోకి చూసి, "చెప్పండి" అంది. ఆమె నన్ను గుర్తుపట్టలేదో, గుర్తు పట్టనట్టు ప్రవర్తిస్తోందో నాకు అర్థంకావడంలేదు. నా కేసు విషయం వేరు. నేను కాబట్టి ఇంతకాలం ఆగాను. మరొకళ్లయితే ఊరుకోరు.

"నా ఇరవయి ఏడువేల పయి చిలుకు డబ్బు సంగతి ఏమయిందో తెలుసుకుందామని వచ్చాను" అన్నాను.

"ఏ ఇరవయి ఏడువేలు?" అడిగింది.

"అదేనండీ... కేన్‌ఫిన్ హోమ్స్‌కు ఇచ్చిన చెక్కుల గురించి..." అంటున్నాను. నా మాటలకు అడ్డొచ్చి, "ఓహ్... మీరు... మీరు..." అని తెచ్చి పెట్టుకున్నట్టుగా నవ్వింది.



నా పేరు చెప్పాను.

"మీ పేరు గుర్తుంది. ఇదో మీరిచ్చిన వివరాలన్నీ ఉన్నాయి" బల్లమీదున్న అద్దంకింద నేను రాసిచ్చిన కాయితం ఉంది.

"ఏం చేశారు?"

ఏం చేసినట్టు నాకు అనిపించడంలేదు. ఆమె ముఖంలో ఎటువంటి భావాలు కనబడడంలేదు. బెల్ కొట్టబోయేంతలో బంట్రోతు బల్ల దగ్గరకు వచ్చాడు.

నన్ను చూపిస్తూ, "సార్‌కు ఒక కాఫీ తెచ్చిపెట్టగలవా?" అంది.

"వద్దండీ, ఇప్పుడే తాగి వచ్చాను" అన్నాను.

బంట్రోతు అవుట్ ట్రేలో ఉన్న చెక్కులు, కాయితాలు తీసుకుని వెళ్లాక, "చూశారుగా, ఈ సమయంలో పని వత్తిడి ఎక్కువగా ఉంటుంది. మీరు ఏమీ అనుకోకపోతే సాయంత్రం అయిదు దాటిన తర్వాత రాకూడదూ?" అంది.

"రాను. నేను ఆ చెక్కుల గురించి రావడం ఇది నాలుగోసారి. ఫోను చేస్తే మీరు దొరకరు. దొరికినా మాట్లాడుతూ లయిన్ కట్ చేస్తారు. ఆ ఇరవయి ఏడువేలు నాకు పెద్ద మొత్తం ఏంకాదు. ఎవరికో దానం చేశానని అనుకుంటాను. లేదూ ఎక్కడో పోయాయని అనుకుంటాను. పొరపాట్లు జరగడం సహజం. నాలా మరొకరు మోసపోకూడదనే ఉద్దేశంతో అసలు ఎలా మోసం జరిగిందో తెలుసుకుందామనే ప్రయత్నంలో ఉన్నాను" కోపం నిగ్రహించు కుంటూ నెమ్మదిగా అన్నాను.

ఆమె ముందుకు జరిగి, "ఈ సమయంలో..." ఏదో అనబోతోంటే ఫోను మోగింది. తీసుకోలేదు.

ఆమె ఏం అనబోతోందో నేను ఊహించగలను. తల అడ్డంగా ఆడించి, "నాలుగు నెలల కిందట వస్తే సాయంత్రం రమ్మన్నారు. వచ్చాను. మీరు రెండున్నరకే బయటకు వెళ్లిపోయారు. రమ్మనమని వెళ్లిపోవడం నాకు భావ్యం అనిపించలేదు., ఈరోజూ అలా జరగదని నమ్మడం లేదు..." వెంట తెచ్చిన ఫయిల్లోంచి అంబుట్స్‌మేన్‌కు రాసిన ఫిర్యాదు తీసి ఆమెకిచ్చి, "చదవండి" అన్నాను.

అందులో నేను కేన్‌ఫిన్‌హోమ్స్ వాళ్లకు ఇచ్చిన మూడు చెక్కుల్లో జరిగిన అవకతవకల గురించి వివరించాను. అంబుట్స్‌మేన్ అంటే కేంద్ర ప్రభుత్వ బేంకులకు అవినీతి నిరోధక శాఖలాంటిది. ఎవరి నుండయినా ఫిర్యాదు వెళ్తే తీవ్రంగానే పరిగణిస్తారు. ముదురు కేసయితే సి.బి.ఐ.కు రాయవచ్చు. అందులో నా పేరు, ఉద్యోగం, చిరునామా, నా సేవింగ్స్ బేంక్ ఎకౌంట్ నెంబరు వివరాలు ఇస్తూ నా ఇంటికయి కేన్‌ఫిన్‌హోమ్స్ నుండి తీసుకున్న లోను తాలూకు ఇ.యం.ఐ నెలకు 1099 రూపాయలు చెక్కుల ద్వారా కేన్‌ఫిన్ హోమ్స్ పంపిస్తుంటే మూడు మాసాల పాటు 1099 రూపాయలను 9099 రూపాయలుగా నా ఖాతాలో చూపించేసరికి కేన్‌ఫిన్‌హోమ్స్ వాళ్లకు డి.డి.లు పంపించేసి నా ఖాతా గురించి సాయిలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లిన సంగతి కూడా నా ఫిర్యాదులో పేర్కొన్నాను. చివరిగా, ఏ సంగతో విచారించి సంబంధిత అధికారుల మీద తగిన చర్య తీసుకుంటూ నాకు రావలసిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలని కోరాను.

నా ఫిర్యాదు చదివాక కూడా

ఆమె ముఖంలో ఎటువంటి భావాలు వ్యక్తంకాలేదు. నేనిచ్చిన కాయితం నా చేతికి అందిస్తూ, "ఇప్పుడు మాకు ఆడిట్ జరుగుతోంది" అంది నెమ్మదిగా. ఆమె కంఠస్వరంలో మటుకు కొద్దిగా మృదుత్వం చోటుచేసుకుంది.

"నాలుగు నెలల కిందట నేను మొదటిసారిగా వచ్చినప్పుడు ఇదే మాట అన్నారు... పెయిడ్ చెక్కులు మీ ఆఫీసులోనే ఉంటాయి కదా, అవి తెప్పించి చూస్తే పొరపాటు నేను చేశానా, మీ బేంకు వాళ్లు చేశారా లేక బయటివాళ్ల ప్రమేయం ఏమయినా ఉందో తెలుస్తుంది కదా?" కోపంతో కాదుకాని, నిరసనగానే అన్నాను. మంచిగా ఉంటే ఒక్కపనీ జరగదు. ఎక్కడో ఒకచోట మంచికీ హద్దు పెట్టుకోవాలి. "అనవసరంగా మీ దగ్గరకు వస్తున్నాను. నా డబ్బులు ఎలా రాబట్టుకోవాలో నాకు తెలుసు..." కోపంగానే అని లేచి నిలబడబోతోంటే, "కూర్చోండి పెయిడ్ చెక్కులు తెప్పిస్తాను" అంది. అని కళ్లద్దాలు తీసి బల్లమీద పెట్టి బెల్ కొట్టింది. కూర్చున్నాను.

బంట్రోతు వస్తూ కొన్ని పేపర్లు తెచ్చి ఒక ట్రేలో పెట్టి, అవుట్ ట్రేలో పేపర్లు తీసుకుంటూ "పెద్ద అయ్యగారు మిమ్మల్ని ఒకసారి రమ్మన్నారమ్మా" అన్నాడు.

"పది నిముషాల్లో వస్తానని చెప్పు... రాజయ్యా, అర్జంటుగా ఈ మూడు నెలల పెయిడ్ చెక్కుల బండిల్స్ తీసుకువస్తావూ?" అడిగి అతనికి చిన్న కాయితం ఇచ్చింది. తీసుకుని వెళ్లిపోయాడు.

"నాకీ సంవత్సరం ప్రమోషన్ ఉంది. నామీద ఏ ఆరోపణ వచ్చినా ప్రమోషన్ తొక్కి పెట్టేస్తారు" అంది. నా చెక్కుల విషయంలో తన మీద తనకు అపనమ్మకంగా ఉందా లేక మునుపు ఎప్పుడయినా పెయిడ్ చెక్కులు తను చూడడం జరిగిందా?

"ఈ ఫిర్యాదు మీమీదకాదు. నా చెక్కుల గురించి మీతో మాట్లాడాను అని రాశాను. లోగడ మీతో మాట్లాడాను కదా?"

"మాట్లాడారు"

"పొరపాటు ఎక్కడ జరిగిందని మీరు ఊహిస్తున్నారు?"

"ముందు చెక్కులు చూడనీయండి" ట్రేలో వున్న కాయితాలు

**రాజయ్య వస్తాడని ఊహించాను కాని చెక్కులున్న కట్టలు తీసుకు వస్తాడని నేను అనుకోలేదు. తీసుకురానందుకు ఏదో సాకు చెబుతాడని అనుకున్నాను. నా ఆలోచన నిజం కాలేదు. తను చేస్తున్న పని పక్కనబెట్టి కట్టలు అందుకుంటోంటే నా ప్రాణం లేచి వచ్చింది. ఆమె ఒక్కో చెక్కు చూస్తోంటే ఆమె ముఖంలోకి చూడసాగాను.**

తీసుకుని ఒక్కోటీ చూస్తూ సంతకాలు ఎరుపురంగు బాల్‌పెన్నుతో చేస్తోంది. విసుగ్గా ఉందేమో కొన్ని పూర్తిగా చదవకుండా సంతకాలు పెడుతోంది. ఈ సమయంలో పని వత్తిడి ఎక్కువగా ఉంటుందని తెలుసు. ఈమధ్యలో రెండుసార్లు ఫోను మోగింది. తీసుకోలేదు. సెల్ కూడా మోగింది. నెంబరు చూసి కట్టేసింది.

పావుగంట తర్వాతగాని రాజయ్య రాలేదు. మూడు కట్టలు ఆమె బల్లమీద పెట్టి వెళ్లిపోబోతుంటే, "నేనిచ్చిన నెంబర్ల దగ్గర కాయితాలు పెట్టయ్యా" అంది.


"పెట్టానండీ" అని ఆమె సంతకాలు చేసిన కాయితాలు తీసుకుని వెళ్లిపోయాడు. రాజయ్య వస్తాడని ఊహించానుకాని చెక్కులున్న కట్టలు తీసుకు వస్తాడని నేను అనుకోలేదు. తీసుకురానందుకు ఏదో సాకు చెబుతాడని అనుకున్నాను. నా ఆలోచన నిజం కాలేదు. తను చేస్తున్న పని పక్కనబెట్టి కట్టలు అందుకుంటోంటే నా ప్రాణం లేచి వచ్చింది.

ఆమె ఒక్కో చెక్కు చూస్తోంటే ఆమె ముఖంలోకి చూడసాగాను. తల అడ్డంగా ఆడిచింది కాని ముఖంలో ఎటువంటి భావం కనిపించలేదు. మూడూ చూశాక నా ముందుకు నెట్టి, "చూడండి" అంది.

నా ముందుకు లాక్కుని ఒక్కొక్కటి చూశాను. మూడు చెక్కుల్లోనూ మార్పులున్నాయి. కెమికల్‌తోనో, బ్లేడును ఉపయోగించో "ఎకౌంట్‌పేయీ" క్రాసింగ్‌తో సహా తీసేశారు. కేన్‌ఫిన్‌హోమ్స్‌ను 'కేన్ బిన్ హోమేష్'గా మార్చారు. 1099 రూపాయలను 9099 రూపాయలుగా అంకెలు, అక్షరాలను మార్చారు. నా సంతకం అలానే ఉంది. చెక్కు వెనక నేను రాసిన పేరు అలానే ఉంది. లోన్ ఎకౌంటు నెంబరు మటుకు తుడిపేసి ఉంది. సామాన్యంగా చెక్కులు క్రిమ్‌సన్ పైలట్ ఇంకుతో సంతకం చేస్తుంటాను. చెక్కుల్లో మార్పులు కొట్టొచ్చిన చోట అదే ఇంకుతో ఎవరో సంతకాలు పెట్టారు. ఆ ఇంకును చాలామంది ఉపయోగించరు. ఆ మాటకొస్తే ఇప్పుడు ఇంకు పెన్నులు ఎవరోగాని ఉపయోగించడంలేదు. బాల్‌పెన్నులు ఉపయోగిస్తున్నారు. చెక్కుల్లో మార్పులు జరిగాయని పరీక్షగా చూడవలసిన అవసరం లేదు. చూస్తుంటే తెలిసిపోతుంది. నేను చేసిన పొరపాటల్లా కార్బన్ తిప్పిపెట్టి చెక్కులు నింపి సంతకం పెట్టలేదు. మార్పులు చేసే అవకాశం నేనే ఇచ్చినట్టయింది. అవి బేరర్ చెక్కులయిపోయాయి. వాటిమీద సాయిలక్ష్మి సంతకాలయ్యాక డబ్బు చెల్లించబడింది.

కట్టలు బల్లకు ఒకపక్కన పెట్టి, "ఎవరు తీసుకుని ఉంటారు?" అడిగాను.

"రోజుకు వందలకొద్దీ సంతకాలు పెడుతుంటాను. సామాన్యంగా ఎంత పని వత్తిడి ఉన్నా జాగ్రత్తగానే చూస్తుంటాను. ఎక్కడో పొరపాటు జరిగింది. ఎవరు తీసుకుని ఉంటారో తెలుసుకోవడం కష్టం" అంది.



"మీ కింది పనిచేసేవాళ్ల సహకారం లేకపోతే ఈ చెక్కులు చెల్లించబడి ఉండేవి కావు."

"ఎవరినని అనుమానించడం?" భుజాలు పయికెత్తి నా ముఖంలోకి నిస్సహాయంగా చూసింది.

"నా డబ్బులు నాకు రావాలంటే నేనేం చేయాలి?" అడిగాను.

"అవి నా సంతకాలు కాబట్టి ఆ బాధ్యత నా మీద వేసుకుంటున్నాను. మీ డబ్బులు నేనిస్తాను. కాకపోతే వెంటనే ఇవ్వలేను. నాకు మూడువారాల సమయం ఇవ్వండి. దానికి మించి ఉండదు..."

"మీ సీనియర్ మేనేజరు దృష్టికి తీసుకువెళ్తేనో?"

"ఏం లాభం ఉండదు. అదో శాడిస్టు మేళం. సమస్యను మరింత జటిలం చేస్తాడు. నన్ను వేధించడానికి అతనికి అవకాశం దొరుకుతుంది. మీరతన్ని కలవాలని ఉంటే వెళ్లి మాట్లాడండి.." కుర్చీ వెనక ఉన్న తువ్వాలు అందుకుని ముఖం తుడుచుకుని, "మూడు వారాలలోగా మీ డబ్బులు మీకు అందకపోతే మీ ఫిర్యాదు అంబుట్స్‌మేన్ వాళ్లకు ఇచ్చేయవచ్చు. నా ఖర్మ అనుకుంటాను" అంది.

ఆమె మీద జాలి వేసింది. లేచి నిలబడి నా విజిటింగ్ కార్డు ఆమె ముందుంచి, "అసలు దోషి ఎవరో కనుక్కోగలిగితే నాకు తెలియచేయండి. ఇది ఏవిధంగా జరిగి ఉంటుందని అనుకుంటున్నారు?" అడిగాను.

రెండు బొటన వేళ్లతో కణతలు నొక్కుకుంటూ, తల అడ్డంగా

ఆడించింది. నా కారు తాళాలు, సెల్ తీసుకుని వెళ్తున్నట్టు తలూపి బయటకు వచ్చాను.

పదిరోజుల తర్వాత సాయిలక్ష్మి నాకు ఫోను చేసి, "మీకో మంచి వార్త" అంది.

"చెప్పండి"

"దొంగ దొరికాడు"

"ఎవరు?"

"జనరల్ పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న రాంపండు అనే అతను ఈ పనులు చేశాడు. మీరు పంపించే కవర్లు కేన్‌ఫిన్ హోమ్స్‌కు వెళ్లకుండా తీసి చెక్కుల్లో మార్పులు చేసి మా బేంకుకు వచ్చి మార్చుకున్నాడు."

"ఇదెలా తెలిసింది?"

"ఐ.సి.ఐ.సి.ఐ బేంకులో కూడా ఇలానే చేస్తే వాళ్లు పోలీసు కంప్లెయింట్ ఇస్తే దొరికాడు. రాంపండును పోలీసులు అరెస్టు చేసి కూపీలాగితే మీ చెక్కుల విషయం బయటపడింది. ఇవేళ పోలీసులు మాకు ఫోనుచేసి చెప్పారు. నాకు ఎంతో సంతోషంగా ఉంది."

"రాంపండును ఏం చేశారు?"

"ఏం చేయలేదు."

"తీసుకున్న డబ్బులు తిరిగిచ్చేశాడా?"

"తిరిగిస్తానని పోలీసులకు రాసిచ్చాడట. అంచేత వదిలిపెట్టేశారట"

"అదేమిటి?" ఆశ్చర్యపోతూ అడిగాను.

**మరుసటి సోమవారం ఆమె చెప్పిన సమయానికి పది నిమిషాలకు ముందే బేంకుకు చేరుకున్నాను. ఆమె గదిలో లేదు. నన్ను రమ్మని తను రాలేదేమో అనిపించింది. అయినా కారు తాళాలు, సెల్ బల్లమీద పెట్టి కూర్చున్నాను. ఇరవయి నిమిషాల తర్వాత ఆమె గదిలోకి వస్తూ, "సారీ, ఆలస్యం అయింది. ఏమనుకోకండి"**

"పోలీసు కస్టడీలో ప్రభుత్వ ఉద్యోగి నలభయి ఎనిమిది గంటలపాటు ఉంటే సస్పెండ్ చేస్తారని వాళ్ల యూనియన్ వాళ్లు కలిసొచ్చి వత్తిడి చేసేసరికి పోలీసువాళ్లు కాదనలేకపోయారట"

"ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసుకోలేదా?"

"లేదనుకుంటాను."

"మీ బేంకు నుండి మీరేమీ ఫిర్యాదు ఇవ్వలేదా?"

"ఇవ్వలేదు. ఇస్తే మాకు ఎవరి మీద అనుమానం అంటే మా స్టాఫ్‌లో ఉందో సూచించాలి. అలా సూచిస్తే లేనిపోని గొడవలు వస్తాయి. బేంకు స్టాఫ్ యూనియన్ తపాలాశాఖ యూనియన్ అంత గట్టిది. ఆధారం లేకుండా ఏదయినా చేస్తే నన్ను నానా యాతనలకు గురిచేస్తారు. వాటిని తట్టుకోవడం నా వలన కాదు."

"రాంపండు డబ్బులు తిరిగి మీకిచ్చేవరకు నా డబ్బులు మీరు నాకివ్వరా?"

"అదేం కాదు. మీ డబ్బులు నేను మీకిస్తాను. వచ్చే సోమవారం ఉదయం పదకొండింటికి మీరు బేంకుకు వచ్చి మీ డబ్బులు తీసుకువెళ్లండి. అంబుట్స్‌మేన్ వాళ్లకు కంప్లయింట్ ఇచ్చారా?"

"ఇవ్వలేదు"అని నేను మరిన్ని వివరాలు అడగబోతుంటే, "ఉంటాను" అని ఫోను పెట్టేసింది. నా అనుమానాలు మిగిలిపోయాయి.

మరుసటి సోమవారం ఆమె చెప్పిన సమయానికి పది నిమిషాలకు ముందే బేంకుకు చేరుకున్నాను. ఆమె గదిలో లేదు. నన్ను రమ్మని తను రాలేదేమో అనిపించింది. అయినా కారు తాళాలు, సెల్ బల్లమీద పెట్టి కూర్చున్నాను. ఇరవయి నిమిషాల తర్వాత ఆమె గదిలోకి వస్తూ, "సారీ, ఆలస్యం అయింది. ఏమనుకోకండి" అని కుర్చీలో కూర్చుని, "ఎంతసేపయింది మీరొచ్చి?" అడిగింది.

చెప్పాను. బల్ల సొరుగులోంచి డబ్బుల కట్ట తీసి నా ముందుంచి, "ఇరవయి ఏడువేలమూడొందలు లెక్కపెట్టుకోండి" అంది సాయిలక్ష్మి.

"మీరు లెక్కబెట్టారుగా. మళ్లీ నేనెందుకు లెక్కబెట్టడం?" అన్నాను. నిజానికి అవి నా ముందుంచే వరకు నాకు ఆమె ఇస్తుందని నమ్మకం పెట్టుకోలేదు.

"రాంపండు డబ్బులిచ్చేశాడా?" అడిగాను.

"ఇవ్వలేదు. నెలకింతని ఇవ్వగలనన్నాడు" సాయిలక్ష్మి అబద్ధాలు చెబుతోందని నాకు తెలుసని ఆమెకు తెలియదు. "మీకు ఇబ్బంది కలిగించకూడదని నా డబ్బు ఇస్తున్నాను" అంది.

"జి.పి.ఒ., అడ్మిన్‌లో యాదగిరి అనే నా స్నేహితుడు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. మీరు రాంపండు గురించి చెప్పినప్పుడు యాదగిరికి చెప్పి రాంపండు గురించి తెలుసుకొమ్మని అడిగితే యాదగిరి ఏమన్నాడో తెలుసా, రాంపండు పేరు గల వ్యక్తి తమ దగ్గరకాని, ఏ సార్టింగ్ ఆఫీసులోకాని, బట్వాడాలో కాని పనిచేయడంలేదని అన్నాడు."

ఆమె ఎర్రటి ముఖం నా మాటలకు మరింత ఎరుపెక్కింది. కళ్లద్దాలు తీసి బల్లమీద పెట్టి నా కళ్లల్లోకి సీరియస్‌గా చూస్తూ "నేను మీతో అబద్ధాలు చెప్పానని..." అంటూంటే ఆమె మాటలకు అడ్డుతగులుతూ, "పోలీసులు అతన్నో, ఎవర్నో నిజంగా అదుపులో తీసుకుని ఉంటే నిజానిజాలు తెలుసుకోడానికి నాకూ కబురు పెట్టేవాళ్లు కదా, కాదా?" అడిగాను.

ఆమె జవాబుకయి ఎదురుచూడకుండా లేచి నిలబడి డబ్బులు జేబులో పెట్టుకుని బయటకు వచ్చాను. అన్ని అబద్ధాలు ఆడుతున్న మనిషికి కృతజ్ఞతలు చెప్పాలనిపించలేదు. ఆవరణ చివరంటా వచ్చి చెట్టు కింద నిలబడి సిగరెట్ వెలిగించాను. కావాలనే రెండు నిజాలను ఆమె ముందుకు వదిలాను. నా కారు తాళాలు, సెల్ ఆమె బల్ల మీదుంచి వచ్చేశాను. సెల్ ఆన్‌లోనే ఉంది. నిజానికది సెల్ కాదు. సెల్‌లా కనిపించే చిన్న టేప్‌రికార్డర్. ఎంతటి చిన్న శబ్దాన్నయినా లాక్కుంటుంది. మరికొన్ని వివరాలు దొరికితే బావుణ్ను. ఆడిట్ దృష్టికి అందకుండా అవకతవకలు జరగవని కాదు. మోసాలూ జరుగుతుంటాయి. అవినీతికి అతీతంగా ఏం ఉండవు. సంవత్సరాల తరబడి బేంకు ఎకౌంటు తట్టని వాళ్ల విషయంలో, లెక్క లేకుండా డబ్బులు జమ అవుతున్న వాళ్ల విషయంలో, ఇంట్లో ఎవరికి తెలియకుండా ఫిక్సిడ్‌లో వేసి సరయిన చిరునామా, నామినేషన్ ఇవ్వకుండా కాలం చేసిన వృద్ధుల విషయంలో, పెద్ద మొత్తాలు అప్పుగా ఇచ్చి విధించే వడ్డీ విషయంలో, వన్‌టైం సెటిల్‌మెంట్ సమయంలో, ప్రాజెక్టులకు అప్పులిచ్చే సమయంలో జరిగేవి పొరపాట్లేమీ కావు. ఈ పనులు ఒకరివలన కావు. కలిసికట్టుగా చేయడం వలన బయటకు రావు. అధికారులకు, స్టాఫ్‌కు బదిలీలు అవుతున్నా జరిగేవి జరుగుతూనే ఉంటాయి. అన్నిచోట్ల జరుగుతాయని కాదు. నా విషయంలో సాయిలక్ష్మి ఒక్కతే చేసే అవకాశం లేదు. ఎవరి సహాయమో తీసుకుని ఉంటుంది. నేనామె గదిలోంచి బయటకు వచ్చిన వెంటనే తనకు తోడ్పడిన వ్యక్తితో తప్పకుండా మాట్లాడుతుంది. నాకు కావలసినవి ఆమె మాటలు.

పదిహేను నిముషాలాగి బేంకులోకి వచ్చి సాయిలక్ష్మి గది తలుపు దగ్గర నిలబడి అద్దంలోంచి లోపలికి చూశాను. ఫోనులో ఎవరితోనో మాట్లాడుతున్నదల్లా నన్ను చూడగానే ఫోను పెట్టేసింది. తలుపు నెట్టి గదిలోకి వచ్చి కారు తాళాలు, సెల్ తీసుకున్నాను. ఆమె ముఖంలోకి చూడలేదు. ఆమె నాతో మాట్లాడలేదు. బయటకు వచ్చి నా కారులో కూర్చుని టేప్ రివైండ్ చేసి మొదటి నుండి వినడం మొదలెట్టాను. ఆమె గొంతు బిగుసుకుపోయే మాటలు చాలా ఉన్నాయి. ఒకచోట నా గురించి చెబుతూ, "వీడు జిడ్డులా పట్టుకుని నన్ను వదలకుంటే ఎలా తప్పించుకునేది? ఏ గొడవా కాకుండా ఉండేందుకు వాడి డబ్బు వాడి మొహాన కొట్టాను... ఇక్కడో పొరపాటు చేశాను. నేనిచ్చిన డబ్బుకు రశీదు తీసుకోలేదు... ఏం కాదుగా?.. పోతురాజు, సాంబశివరావులు చచ్చిపోయారు కాబట్టి మనం బతికిపోయాం. లేకుంటే అక్కడ కూడా డబ్బులు కక్కాల్సి వచ్చేది... విజయవాడ ఆజాద్ స్థలం డీల్ ఏమయింది?..." మాటలు సాగిపోతున్నాయి. పోతురాజు, సాంబశివరావులు నాలాటివాళ్లయి ఉంటారు. ఆమె దురదృష్టం కొద్దీ నేను బతికి ఉన్నాను.

●